సాక్షి పల్నాడు

బుధవారం । 25 । జూన్ । 2025



శివపార్వతుల శాంతి కల్యాణం

రెంటచింతల: పాత పాలువాయిలోని గంగా భ్రమరాంబ సమేత కాళేస్థీశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం శివపార్వతుల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు.



అమ్మవార్లకు పొంగళ్లు

ప్రత్తిపాడు: కొత్తమల్లాయపాలెంలోని పోలేరమ్మ తల్లి, గంగమ్మ తల్లి, పోతురాజు స్వామి వార్ల ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పొంగళ్లు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు.



పౌర సరఫరాల శాఖ డీఎంగా తులసి

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): పౌర సరఫరాల శాఖ గుంటూరు జిల్లా మేనేజర్‌గా కె.తులసి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

గుంటూరు జిల్లా పోలీసులు రెచ్చిపోతున్నారు. నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాల్సి ఉన్నా కూటమి పాలకుల అడుగులకు మడుగులొత్తుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమల్లో అత్యుత్సాహం చూపుతున్నారు. ప్రజలకు రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ గాలికొదిలేసి ప్రభుత్వ పెద్దలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా కేసులు పెడుతున్నారు. అడ్డగోలుగా నోటీసులు జారీ చేస్తున్నారు. ఇప్పుడు ఏకంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటనపై నానా రాద్ధాంతం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి సంబంధం ఉంటే చాలు.. ఎవరిమీద పడితే వారిమీద కక్ష సాధిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



రెచ్చిపోతున్న
రెడ్‌బుక్ పోలీస్

- వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా కేసులు, నోటీసులు
- విమర్శలకు దారి తీస్తున్న ఉన్నతాధికారుల వైఖరి
- వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరగడంతో కూటమి సర్కార్ కుట్ర
- పాలకుల మెప్పు పొందేందుకు పలువురు పోలీసులు తహతహ
- పాత కేసులు తిరగతోడుతూ ఎప్పడికప్పడు కొత్తగా నమోదు

గుంటూరు జిల్లాలో అడ్డగోలుగా పోలీసుల తీరు



ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి నోటీసులు అందజేస్తున్న నగరంపాలెం పోలీసులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో గుంటూరు జిల్లా పోలీసులు రెండు ఆకులు ఎక్కువే చదివారు. మంత్రి లోకేష్ ఆదేశాలను అమలు చేయడమే విధిగా పెట్టుకుని పనిచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి జిల్లాలో రోజురోజుకు మరింత ఆదరణ పెరుగుతుండటంతో పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నేతలే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటనపై ఆంక్షలు విధించిన పోలీసులు.. దీన్ని అడ్డం పెట్టుకుని పార్టీలో చురుకుగా ఉండే నేతలకు నోటీసులు జారీ చేశారు. కేసులు నమోదు చేస్తూ వేధింపులకు దిగుతున్నారు.

తెరపైకి పాత అక్రమ కేసులు

ఈ ఏడాది ఫిబ్రవరి 19వ తేదీన మిర్చి రైతులను పరామర్శించేందుకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన సందర్భంగా పెట్టిన అక్రమ కేసులను ఇప్పుడు తిరగతోడుతున్నారు. ఆ సందర్భంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు నేతలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, కొడాలి నాని, అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కావటి మనోహర్‌నాయుడు, మోదుగుల వేణుగోపాలరెడ్డి, పేర్ని నాని తదితరులపై బీఎన్‌ఎస్ 223, 189(2), 329(4), 292, 126(2), 195(1) రెడ్‌విత్ 190 బీఎన్‌ఎస్, 125 ఆర్‌పీఏ 1951 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అసలు ఆ పర్యటనకు రాని పేర్ని నాని పేరు కూడా అప్పట్లో నమోదు చేయడం విమర్శలకు దారితీసింది. తాజాగా ఆ కేసులో అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డి, కావటి మనోహర్‌నాయుడు, మోదుగుల వేణుగోపాలరెడ్డికి విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు జారీ చేశారు.

మాజీ సీఎం కారు స్వాధీనం

తాజాగా సత్తెనపల్లి పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంలో చీలి సింగయ్య మృతి చెందడంతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన బుల్లెట్ ప్రూఫ్ కారును స్వాధీనం చేసుకుని నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో ప్రభుత్వ డ్రైవర్‌తో పాటు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, పీఏ కె.నాగేశ్వరరెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజినీపై కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

నోటీసుల పేరిట బెదిరింపులు

మరోవైపు వైఎస్ జగన్ పర్యటనకు సంబంధించి అంబటి రాంబాబు, లేళ్ల అప్పిరెడ్డితోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలకు నోటీసులు జారీ చేశారు. పర్యటన ముందు కూడా నోటీసులు ఇచ్చి కార్యక్రమానికి వెళ్లవద్దంటూ బెదిరింపులకు గురిచేశారు. పాత గుంటూరు ప్రాంతానికి చెందిన పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, స్వర్ణలత, పార్టీ మహిళా విభాగం నేత గనిక ఝాన్సీలకు ర్యాలీకి వెళ్లేందుకు అనుమతి లేదంటూ ముందుగానే నోటీసులు జారీ చేశారు. ఈ క్రమంలో పోలీసులు నోటీసులు ఇస్తామని భయపెట్టిన నేపథ్యంలో ఝాన్సీ, స్వర్ణ ర్యాలీకి వెళ్లలేదు. అయినప్పటికీ పాత గుంటూరులో వీరిద్దరూ ర్యాలీకి వెళ్లినట్లు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

వీడియోలు తీయడమే పనా?

వైఎస్ జగన్ పర్యటనలో భాగంగా ఆయన్ని చూసేందుకు వచ్చిన ప్రజానీకం, పార్టీ నేతలు, కార్యకర్తలను పోలీసు యంత్రాగం, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్, మఫ్టీ పార్టీలు, ఆఖరికి రోడ్డుపై డ్రస్సుల్లో ఉన్న పోలీసులు సైతం సెల్‌ఫోనుల్లో చిత్రీకరించారు. పర్యటనకు వచ్చిన వారిని భయభ్రాంతులకు గురి చేసే దిశగా ఇటువంటి చర్యలకు ఉపక్రమించారు. జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్న వ్యక్తికి రక్షణ కల్పించకుండా కనీస ఏర్పాట్లు చేయకుండా బాధ్యతలను గాలికి వదిలేసిన పోలీసులు.. ఇప్పుడు వేధింపులకు మాత్రమే పరిమితం కావడం సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది.

అధికార పక్షమైతే ఓకే...

వైఎస్ జగన్ ఇంటిపైకి తాటికాయలు విసిరిన వారిని పిలిచి స్టేట్‌మెంట్ తీసుకుని పంపించేశారు. మాజీ ముఖ్యమంత్రి ఇంటిపైకి ఇలా విసిరినా.. కేస విషయంలోనే ఎంతో ఉదాసీనంగా వ్యవహరించారు. ప్రజా సమస్యలపై గళం విప్పుతున్న కారణంగా సాక్షి కార్యాలయంపై అమరావతి జేఏసీ పేరుతో కొందరు మూకుమ్మడిగా వచ్చి విధ్వంసం సృష్టించినా ఇప్పటివరకూ కనీసం ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ నుంచి ఎవరు ఫిర్యాదు చేసినా వెంటనే కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడంలో గుంటూరు పోలీసులు ముందుంటున్నారు. ముఖ్యంగా ఒక సామాజిక వర్గానికి చెందిన అధికారులు చూపిస్తున్న ఉత్సాహంపై పోలీసుల పట్ల ప్రజల్లో ఉండే నమ్మకం సడలిపోయేలా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

న్యూస్‌రీల్

అమరేశ్వర స్వామికి ఆదాయం

అమరావతి (పెదకూరపాడు): అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవాలయానికి సంబంధించి ముప్పాళ్ళ మండలం మాదల, దమ్మాలపాడు గ్రామాల్లోని సుమారు 70 ఎకరాల భూములను బహిరంగ వేలం వేయగా, గత ఏడాది కంటే రూ.8,14,500 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ కార్యదర్శి రేఖ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-23, 2024-25 కాలానికి గతంలో రూ. 6,13,000 ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం 2025-26, 2026-27 సంవత్సరాలకు రూ.14,27,500 ఆదాయం సమకూరిందన్నారు. గతంతో పోల్చుకుంటే రూ. 8,14,500 ఆదాయం వచ్చిందని ఆమె తెలిపారు.

పులిచింతల వద్ద మొసళ్లు



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు జలాశయంలోనే కాదు. ఇటీవల కాలంలో ప్రాజెక్టు మీదకు కూడా మొసళ్లు వస్తున్నాయి. ఈ ప్రాంతం రెండు తెలుగు రాష్ట్రాల సరిహద్దు కావడంతో రాకపోకలు కొనసాగించాలంటే ప్రాజెక్టు మీద నుంచే వెళ్లాలి. కొంత మంది ప్రాజెక్టు మీదుగా నడిచి కూడా వెళుతున్నారు. ఏమాత్రం అప్రమత్తంగా లేకున్నా మొసళ్లతో ముప్పు పొంచి ఉందన్న విషయాన్ని వాహనారులు, పాదచారులు గుర్తుంచుకోవాలి.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి నరసరావుపేటకు చెందిన వేమ వెంకటేశ్వరరావు, నాగరజిని దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. ఆలయ ఈవో నలబోతు మాధవిదేవిని మంగళవారం ఆలయ కార్యాలయంలో కలిసిన దాతలు విరాళం మొత్తాన్ని అందించారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఈ సందర్భంగా ఈవో కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయ శర్మ, నండూరి కాళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఐషర్ లారీలో మంటలు



నరసరావుపేట రూరల్: షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఓ లారీ దగ్ధమైన ఘటన కోటప్పకొండ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు... బొప్పాయి లోడ్ కోసం పశ్చిమబెంగాల్ నుంచి ఐషర్ వాహనం కోటప్పకొండకు వచ్చింది. లారీని రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్, క్లీనర్ టిఫిన్ చేస్తుండగా ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. సమీపంలోని వారు గమనించి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఇంజన్, క్యాబిన్‌కు మంటలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఘటనా స్థలాన్ని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్ పరిశీలించారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు బృందావన్‌గార్డెన్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ ఆధ్వర్యంలో విశ్వశాంతిని కాంక్షిస్తూ హోమం చేపట్టారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులతో తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, రుద్ర, లక్ష్మీ గణపతి, చండీ హోమాలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శులు ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 514.30 అడుగుల వద్ద ఉంది. ఇది 139.0872 టీఎంసీలకు సమానం.

ఇళ్లు కట్టిస్తానని మోసగించిన వ్యక్తి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ ఆనంద్

తెనాలి రూరల్: పేదలకు ఇళ్లు కట్టిస్తానని మోసం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా తెనాలి మండలంలోని పెదరావూరు, బుర్రిపాలెం, నేలపాడు గ్రామాలలో పలువురికి స్థలాలను మంజూరు చేశారు. అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పట్టాలు అందజేశారు. లబ్ధిదారులకు ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రూ. 1.80 లక్షలు మంజూరు చేశారు. ఆ క్రమంలో ఎస్‌జీ బిల్డింగ్ వర్క్స్ పేరిట పట్టణ మారీసుపేట 24వ వార్డు శాంతినగర్‌కి చెందిన కాంట్రాక్టర్ కం ఏజెంట్ ఎం. పున్నారావు తెరపైకి వచ్చాడు. తాను తక్కువ ఖర్చుతో సకాలంలో ఇళ్లు కట్టిస్తానని సుమారు 175 మంది లబ్ధిదారులను నమ్మించాడు. వారి నుంచి అటు ప్రభుత్వం ఇచ్చిన నగదు, ఇటు లబ్ధిదారుల సొంత డబ్బు అందినకాడికి దండుకుని కొద్దిపాటి పనులు మాత్రమే చేశాడు. లబ్ధిదారులను ఇన్నాళ్లు ఇబ్బందులకు గురి చేస్తూ వచ్చాడు. బాధితుల ఫిర్యాదుతో రూరల్ పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు 58 మంది బాధితులను విచారించి మంగళవారం పున్నారావును అరెస్ట్ చేశామని రూరల్ ఎస్ఐ కె. ఆనంద్ తెలిపారు. ఇదే తరహాలో పేదలను మోసం చేసిన మరో ఏడుగురు కాంట్రాక్టర్లపై త్వరలో చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు.

భార్యపై అనుమానంతో వ్యక్తి హత్య



జంపని సురేష్

భట్టిప్రోలు(వేమూరు): భార్యపై అనుమానంతో ఓ వ్యక్తిని కత్తితో నరికి హత్య చేసిన ఘటన సోమవారం రాత్రి భట్టిప్రోలులో చోటుచేసుకుంది. వేమూరు రూరల్ సీఐ వీరాంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేమూరు మండలం జంపని గ్రామానికి చెందిన చాగర్లమర్రి రత్నరాజు, జంపని సురేష్ స్నేహితులు. రత్నరాజు తాపీ పనిచేస్తుండగా, సురేష్ వడ్రంగి పనిచేస్తున్నాడు. రత్నరాజు భట్టిప్రోలు గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. భార్యాభర్తలు గొడవపడడంతో ఆమె భట్టిప్రోలులోని పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఈనేపథ్యంలో సోమవారం రాత్రి రత్నరాజు భట్టిప్రోలు వచ్చాడు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో జంపని గ్రామానికి చెందిన జంపని సురేష్ తారసపడ్డాడు. దీంతో రత్నరాజు అతనిని ఇక్కడకు ఎందుకు వచ్చావ్ అని ప్రశ్నించాడు. ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. రత్నరాజు తన చేతిలో ఉన్న కత్తితో సురేష్‌ను పొడిచి హత్య చేశాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు.

బర్లీ కొనుగోలులో జాప్యం తగదు

జిల్లా రైతు సంఘం నాయకులు



పర్చూరులో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు


పర్చూరు(చినగంజాం): బర్లీ పొగాకును రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసే విషయంలో జాప్యం చేస్తే తగదని.. మరింత వేగవంతం చేయాలని జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు మంగళవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి రోజుకు 200 బేళ్ల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, ఇదే విధంగా కొనుగోలు సాగితే రైతుల వద్ద ఉన్న పంట అంతా అమ్ముడుపోయేందుకు ఆరు, ఏడు నెలలు పైగానే సమయం పడుతుందన్నారు. జాప్యం చేయకుండా త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయాలని కోరారు. రోజుకు కనీసం 1000 బేళ్లు చొప్పున పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మార్క్‌ఫెడ్ నిర్ణయించిన హై గ్రేడు ధర రూ.12 వేలు, లోగ్రేడ్ ధర రూ.6 వేలు చొప్పున ప్రస్తుతం కొనుగోలు చేస్తున్నారన్నారు. మధ్య గ్రేడు పొగాకు ధర క్వింటా రూ.9 వేలు నిర్ణయించి కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బండి శంకరయ్య మాట్లాడుతూ పొగాకు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా పొగాకు కొనుగోలు వేగవంతం చేయడంతోపాటు మరికొన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కే శ్రీనివాసరావు, ఎం డేవిడ్, ఎర్రం శ్రీనివాసరెడ్డి, వీ పుల్లారెడ్డి, కే నాగురు తదితరులు పాల్గొన్నారు.

పొడా సమావేశంలో 15 అంశాలు ఏకగ్రీవ ఆమోదం



నరసరావుపేట: స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని జేసీ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అధ్యక్షతన మంగళవారం పల్నాడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పొడా) కమిటీ సాధారణ సమావేశం నిర్వహించారు. దీనికి హాజరైన అధికారులు అజెండాలో ప్రభుత్వం విడుదల చేసిన 15 అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. పొడా అభివృద్ధికి చేయాల్సిన అంశాలపై చర్చించారు. సమావేశంలో టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ రీజినల్ డెప్యూటీ డైరెక్టర్ పి.మధుకుమార్, ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజానాయక్, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.రాంబొట్లు, పర్యాటక శాఖ జిల్లా అధికారి జి.నాయుడమ్మ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి జి.అనీల్‌కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా అధికారి జి.కృష్ణారావు, పొడా ప్లానింగ్ అధికారి పాల్గొన్నారు.

వాగులో లారీ బోల్తా



ప్రత్తిపాడు: వాగులో లారీ బోల్తా పడిన ఘటన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పాత మద్రాసు రోడ్డు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ప్రకాశం జిల్లా ఉప్పుగుండూరు నుంచి గుంటూరు వైపు ధనియాల లోడుతో వెళుతున్న లారీ మంగళవారం రాత్రి ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెం లోలెవల్ చప్టా సమీపంలో కొండవాగులో బోల్తా పడింది. చప్టా ఇరుకుగా ఉండటం, ముందు వెనుకలు ఎలాంటి సైన్‌బోర్డులూ లేకపోవడంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించబోయి మార్జిన్లు అర్థం కాక లారీ వాగులో బోల్తా పడినట్లు తెలుస్తుంది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు.

సీపీవోగా ఏ.షాలెమ్‌రాజు

బాపట్ల: బాపట్ల జిల్లా ప్రణాళిక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఏ.షాలెమ్ రాజు జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. ఇప్పటివరకు ఇక్కడ సీపీఓగా పనిచేసిన కె. శ్రీనివాసరావు విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న షాలెమ్ రాజు నియమితులయ్యారు. ప్రణాళిక శాఖలోని అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టండి

- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు
- నేటి నుంచి కేంద్ర బృందాలు గ్రామాల సందర్శన



మాట్లాడుతున్న కలెక్టర్

నరసరావుపేట: ఏఎంఎస్ కేంద్ర బృందాలు బుధవారం నుంచి గ్రామాలు సందర్శన చేసి స్వచ్ఛతపై సర్వే నిర్వహిస్తున్నందున జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీఓలు అందరూ గ్రామాల్లో ఉండి పారిశుద్ధ్య నిర్వహణలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2025 వర్క్‌షాప్ నిర్వహించి పంచాయతీరాజ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. కేంద్ర బృందాలు సర్వీస్ లెవెల్ ప్రోగ్రెస్, హౌస్ హోల్డ్ అసెస్‌మెంట్, పబ్లిక్ ప్లేసెస్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్స్, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణ, సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌లపై సర్వే నిర్వహించి గ్రామాలకు ర్యాంకింగ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్ సర్వే పంచాయతీరాజ్ సిబ్బందికి వేయి మార్కుల పరీక్ష వంటిదని పేర్కొన్నారు. సర్వేను సమర్థవంతంగా నిర్వహించడంలో కేంద్ర బృందానికి సహకారం అందించి జిల్లాను ర్యాంకింగ్‌లో ముందుంచాలని ఆదేశించారు. నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, డీఎల్‌డీఓలు ఎం.వెంకటరెడ్డి, రాజగోపాల్, గబ్రు నాయక్, నరసరావుపేట డీఎల్‌పీఓ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏడుకొండలు హాజరయ్యారు.

భూ వివాదం బంధాల మధ్య చిచ్చురేపింది

- సోదరుల మధ్య ఘర్షణ
- ఆస్పత్రి పాలైన తమ్ముడు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన చెల్లెలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరాంజనేయులు

యడ్లపాడు: భూ వివాదం రక్తసంబంధాలను దాటుకుని దాడికి పురిగొల్పింది. ఫలితంగా అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో తమ్ముడు తీవ్రంగా గాయపడగా, చెల్లెలు అన్నపై ఫిర్యాదు చేసిన సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎలుకా సాంబయ్య, వీరమ్మ దంపతులకు వెంకటరావు, వీరాంజనేయులు, వెంకమ్మ ముగ్గురు సంతానం. తండ్రి మోకాళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితి, తల్లికి పక్షవాతం కారణంగా కుమార్తె వెంకమ్మ ఆదరణలో ఉన్నారు. ఈ క్రమంలో ఇటీవల వీరాంజనేయులు భార్య కాలం చేయడంతో అతని కుమార్తెను ఆమె చూసుకుంటుంది. తల్లి వీరమ్మ పేరిట రెండు ఎకరాల పొలం ఉంది. కొద్దిరోజులుగా అందులో సగం తనకు పంపిణీ చేయాలంటూ పెద్ద కుమారుడు వెంకటరావు కుటుంబ సభ్యుల్ని కోరగా, అలా సాధ్యం కాదని మిగిలిన ఇద్దరు అడ్డు చెప్పడంతో వివాదం మొదలైంది.

దీంతో ఈనెల 22వ తేదీన అన్నదమ్ముల మధ్య గొడవ రాజుకుంది. ఆగ్రహావేశంతో అన్న తమ్ముడి తలపై రోకలి బండతో మోదాడు. దీంతో తీవ్రగాయాలైన తమ్ముడిని కుటుంబ సభ్యులు గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. మంగళవారం బాధితుడి సోదరి వెంకమ్మ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి శివరామకృష్ణ తెలిపారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఈ నెల 26న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు నగరంలో పర్యటించే మార్గాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నగరపాలక సంస్థ నుంచి తగిన ఏర్పాట్లు చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సీఎం ఆ రోజు నగరానికి రానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం విద్యానగర్, రింగ్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ అధికారులతో కలిసి మేయర్ పర్యటించారు. నగరపాలక సంస్థ, పోలీస్ విభాగాలు సమన్వయంతో ఎటువంటి సమస్యల తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ కన్వెన్షన్ నుంచి జేకేసీ కాలేజీ రోడ్ వైపుగా గుజ్జనగుండ్ల సెంటర్, రింగ్ రోడ్, విద్యానగర్ మెయిన్ రోడ్ వరకు ఏఎస్పీ రమణమూర్తి, గుంటూరు ఆర్డీఓ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్‌లతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు.

ఉపాధి పనుల్లో లోపాలు

రికవరీలకు డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి ఆదేశాలు



ప్రజావేదికలో రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారులు

యడ్లపాడు: ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై 17వ విడత సామాజిక తనిఖీ నివేదికను ప్రతిపాదిస్తూ ఎంపీడీవో కార్యాలయం వద్ద మంగళవారం బహిరంగ సభ (ప్రజావేదిక) నిర్వహించారు. 024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31 వరకు మండలం పరిధిలో 1125 పనులను రూ.9,40,60,750 ఉపాధి నిధులతో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించింది. ఈ పనుల్లో అనేక నిర్వహణ లోపాలు ఉన్నట్లు డ్వామా పీడీ సిద్ధలింగ మూర్తి వెల్లడించారు. ఎంపీపీ పిడతల ఝాన్సీసాగర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎంపీడీవో వి.హేమలతాదేవి, ఏపీడీ హీరాలాల్, ఏపీవో విజయకుమారి, ఏపీవో డి.సుందర్రావు, టీఏ మాధవి, ఎస్ఆర్పీ బి.ఆవులయ్య పాల్గొన్నారు. పీడీ వెల్లడించిన వివరాల ప్రకారం జంగిల్ క్లియరెన్స్ పనులకు సంబంధించి సరైన ఆధారాలు లేకుండానే బిల్లులు తీసుకున్నట్లు గుర్తించామన్నారు. అలాగే శ్రామికుల మస్టర్లు అసంపూర్ణంగా ఉన్నాయన్నారు. పంటకాల్వల పూడిక తీతల పనుల్లోనూ అవకతవకలు ఉన్నట్లు తేలిందన్నారు. పనుల ప్రదేశాల్లో నేమ్‌బోర్డుల ఏర్పాటు చేయని విషయాలు వెలుగు చూశాయన్నారు. ముఖ్యంగా పంచాయతీరాజ్ పనులు పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయన్నారు. 5 శాతం రాయితీ జీవోను చూపకుండా 20 శాతం చెల్లింపులు చేయడం వంటి విషయాలు బయటపడ్డాయన్నారు. గత 16వ విడతలో రూ.1.73 లక్షల రికవరిలో ఇంకా రూ.63,390 బకాయి ఉందన్నారు. దీనిని వెంటనే రికవరీ చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు.

వైఎస్సార్ సీపీ 'పశ్చిమ' సమన్వయకర్తగా అంబటి



పట్నంబజారు (గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా అంబటి రాంబాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. ఇప్పటికే అంబటి జిల్లా అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2019 ఎన్నికల్లో వై.ఎస్.జగన్ సత్తెనపల్లి సీటు ఇవ్వడంతో ఆయన అక్కడ విజయం సాధించారు. కేబినెట్‌లో రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రిగా అంబటి బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తరువాత జిల్లా అధ్యక్షులుగా నియమితులైనప్పటి నుంచి అధిష్ఠానం పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమాల్లో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు.

ఖతార్‌లో ఉద్యోగావకాశాలు

గుంటూరు వెస్ట్/ఎడ్యుకేషన్: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖతార్ దేశంలో టీఐజీ అండ్ ఏ, ఆర్‌సీ మల్టీ వెల్డర్ సర్వీసుల కింద ఉద్యోగం చేయాలనుకునే పురుష అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశాలను కల్పిస్తోందని గుంటూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, ఐటీసీ విద్యార్హతలతో 24 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు, సంబంధిత వృత్తి నైపుణ్యంలో నాలుగేళ్ల కనీస అనుభవం ఉండాలని తెలిపారు. టీఐజీ అండ్ ఏఆర్‌సీ మల్టీ వెల్డర్‌కు వేతనం నెలకు రూ.51,939 నుంచి, టీఐజీ అండ్ ఏఆర్‌సీ వెల్డర్‌కు రూ.42,478 నుంచి ఉంటుందని వివరించారు. కనీసం రెండేళ్లు అక్కడ పనిచేయాల్సి ఉంటుందనానరు. సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్యాల ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన, వైద్య, రవాణా సదుపాయాలతో కూడిన ఈ ఉద్యోగావకాశాల కోసం అభ్యర్థులు ఈ నెల 25లోపు 99888 53335, 87126 55686 ఫోను నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

లోక్ అదాలత్ ఇచ్చేది అంతిమ తీర్పే

- సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి
- జాతీయ లోక్ అదాలత్‌పై ఎస్‌హెచ్‌ఓలతో సమీక్ష



సమీక్ష చేస్తున్న న్యాయమూర్తి విజయ్ కుమార్‌రెడ్డి, పక్కన న్యాయమూర్తులు తౌషిద్ హుస్సేన్, ప్రియదర్శిని, సుజన్ కుమార్

సత్తెనపల్లి: లోక్ అదాలత్‌లో ఇచ్చేది అంతిమ తీర్పుగా భావన చేయాలని మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్ కుమార్ రెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఆధ్వర్యంలో సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో ఉన్న పోలీసు అధికారులతో జూలై 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సెక్షన్లు, ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలని ఆయా ఎస్.హెచ్.వో లకు సూచనలు చేశారు. ముందు సత్తెనపల్లిలో ఉన్న న్యాయమూర్తులు, ఎస్.హెచ్.ఓ లతో గుంటూరు జిల్లా 2వ అదనపు జిల్లా జడ్జి నాగరాజు, గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జియాఉద్దీన్‌లు వర్చువల్‌గా జాతీయ లోక్ అదాలత్ పై సమీక్ష చేశారు. అనంతరం స్థానిక న్యాయమూర్తులు స్వయంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సత్తెనపల్లి ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తౌషిద్ హుస్సేన్, మొదటి అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని, రెండవ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) జె. సుజన్ కుమార్, ఆయా పోలీసు స్టేషన్ల ఎస్.హెచ్.ఓ లు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి



డీఈవో రేణుకకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీలతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను తక్షణమే విధుల నుంచి రిలీవ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈవో సీవీ రేణుకను కలసి వినతి పత్రం సమర్పించారు. వివిధ కేటగిరీలకు చెందిన 5,147 మంది ఉపాధ్యాయులు బదిలీ కాగా.. వారిలో కొంత మంది బదిలీ అయిన పాఠశాలలకు వెళ్లారన్నారు. మిగిలిన వారిలో ఎక్కువమంది పాతస్థానాల నుంచి రిలీవ్ కాలేదని పేర్కొన్నారు. వీరివల్ల మిగిలిన టీచర్లు సైతం ఆగిపోవాల్సి వస్తోందని, ఎంటీఎస్ టీచర్లతోపాటు సర్‌ప్లస్‌లో ఉన్న టీచర్లను సర్దుబాటు చేయడం ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. క్యాడర్ వివరాలు అప్‌డేట్ చేసి, వేతనాలకు సంబంధించిన సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల పేర్లను సంబంధిత ప్రైవేటు పాఠశాలలు డ్రాప్‌బాక్స్‌లో పెట్టేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఈవోను కలిసిన వారిలో యూటీఎఫ్ నాయకులు జి. వెంకటేశ్వర్లు, కె.సాంబశివరావు, ఎం.గోవిందు, బి. ప్రసాద్, ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, ధనలక్ష్మి, ప్రసన్న ఉన్నారు.

ప్రజలను మెప్పించని కూటమి ఏడాది పాలన

జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): ఆంధ్రప్రదేశ్‌లో ఏడాది కూటమి పాలన ప్రజలను నిరుత్సాహ పరిచిందని, అప్పుల ఊబిగా రాష్ట్రాన్ని మార్చిందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏడాదిలోనే రూ. 1.6 లక్షల కోట్ల అప్పులను ప్రభుత్వం చేసిందని తెలిపారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో రూ. 15,480 కోట్ల మేరకు అదనపు భారం వినియోగదారులపై మోపిందన్నారు. వేలాది బెల్ట్ షాపులతో మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చిందని విమర్శించారు. ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్న నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ హామీలను అమలు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి అమలు పరచడం మరిచిపోయారన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని పలు అంశాల అమలుకు ఎలాంటి కృషి చేయలేదని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గత సంవత్సర కాలంగా వివిధ రకాల ఈవెంట్‌లను నిర్వహిస్తూ ప్రజాధనాన్ని రూ.వందల కోట్ల మేరకు వృథా చేశారని ఆరోపించారు. నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు అవినీతిపరులుగా మారి ఇసుక, మద్యం, మైనింగ్, బదిలీలలో ధనార్జన చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీస్ యంత్రాంగం అధికార పార్టీ నేతల ప్రైవేట్ సైన్యంగా మారి ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెడుతోందని తెలిపారు.

ధాన్యం బకాయిలు తక్షణమే చెల్లించాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి చింతలపూడి అశోక్ కుమార్



పిడుగురాళ్ల: రైతులు విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క రూపాయి చెల్లించకపోవడం రైతులను మోసం చేయడమేనని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగ అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ విమర్శించారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతులకు మే 9 నుంచి ధాన్యం బకాయిలు చెల్లింపులు ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. రబీలో రైతులకు ఇంకా రూ. కోట్ల రూపాయలు ధాన్యం డబ్బులు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ధాన్యాన్ని అమ్మిన రైతులకు కూటమి ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ము చెల్లించకపోవడంతో రైతులు రోడ్డున పడ్డారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల వద్ద రైతులు వినతి పత్రాలు, నిరసన కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోవట్లేదన్నారు. రబీ పంట డబ్బులు తక్షణం చెల్లించకపోతే రైతులు ఖరీఫ్ సాగు చేయడం కష్టమని తెలిపారు. రైతులు క్రాప్ హాలిడే ప్రకటిస్తే ఆహార సంక్షోభం వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణం రైతులకు ఇవ్వాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. సాగు చేసుకోవడానికి అందించాల్సిన ప్రభుత్వ ప్రోత్సాహం సాగు సాయం కూడా రైతులకు ప్రభుత్వం అందించట్లేదని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దళారీ వ్యవస్థను రద్దుచేసి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు అందించారన్నారు. రైతుల సాగు చేసిన పంటలు కొనుగోలు జగన్ ప్రభుత్వమే చేసిందన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణం రైతుల సమస్యను పరిష్కారం చేసి కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే రైతుల ఖాతాలో నగదు జమ చేయాలని డిమాండ్ చేశారు.

ఆశ వర్కర్లపై రాజకీయ వేధింపులా?

- ఆశవర్కర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమారి
- యడ్లపాడు పీహెచ్‌సీలో సమావేశం
- జూలై 9 సమ్మెకు సిద్ధం కావాలంటూ పిలుపు



మాట్లాడుతున్న శివకుమారి

యడ్లపాడు: కూటమి ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆశవర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమారి డిమాండ్ చేశారు. యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో కె.బుజ్జి అధ్యక్షతన ఆశవర్కర్ల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ చెప్పిన సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఆశ వర్కర్ల సమస్యల్ని తప్పక పరిష్కరిస్తామంటూ వాగ్దానం చేసి తీరా అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తయినా నేటికీ ఒక్క సమస్యను ముఖ్యమంత్రి పరిష్కరించలేదన్నారు.

పైగా రాజకీయంగా స్థానిక టీడీపీ నాయకులే వేధింపులకు గురి చేయడం, ఆశ వర్కర్లను తమ విధుల నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారం చేపట్టాక ప్రస్తుతం చేస్తున్న చిరుద్యోగులను తొలగిస్తున్న విషయాలను గమనించి న్యాయం చేయాలని లేకుంటే ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ సంస్థలకు రెడ్‌కార్పెట్ పరుస్తోందని విమర్శించారు. బ్రిటీష్ కాలానికి ముందే పోరాడి, ఎందరో ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, కేవలం నాలుగు కోడ్‌లుగా మార్చి తీరని ద్రోహం చేస్తుందన్నారు. దీనిని నిరసిస్తూ జులై 9వ తేదీన జరిగే ఆశ వర్కర్ల సమ్మెలో అందరూ భాగస్వాములై తమ సమస్యల గళాన్ని ప్రభుత్వానికి వినిపించాలని పిలుపునిచ్చారు.

కొత్త కమిటీ ఎన్నిక

సమావేశం అనంతరం ఆశ వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షురాలు పి.నాగలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎం.మల్లేశ్వరి, పి.సుశీల, ప్రధాన కార్యదర్శి వేళంగిని దేవి, కోశాధికారి, సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటలతో అధిక దిగుబడులు



చినగంజాం: రైతులు రాబోయే సీజన్‌లో పొగాకుకు ప్రత్యామ్నాయంగా వివిధ పంటలు సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు రత్నకుమారి సూచించారు. మండలంలోని చింతగుంపల, కడవకుదురు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఆర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రత్నకుమారి మాట్లాడుతూ.. మండలంలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వాటిలో రైతుల నమోదు ప్రక్రియ జరుగుతోందన్నారు. ముందస్తుగా మార్క్‌ఫెడ్ నుంచి షెడ్యూల్ ఇస్తామని, ఆ షెడ్యూల్ ప్రకారం పొగాకు కొనుగోలు కేంద్రాలకు ఉత్పత్తులను తీసుకెళ్లాలన్నారు. అనంతరం వేరుశనగ పైరును పరిశీలించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే సంవత్సరంలో మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసుకోవాల్సిందిగా సూచించారు. కౌలు రైతు కార్డులు పంపిణీ చేస్తున్నామని, అర్హులైన వారు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏలు సంధ్య, కిషోర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గ్రామాలను తీర్చిదిద్దడమే లక్ష్యం



బాపట్ల: గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సమన్వయంతో యంత్రాంగం పని చేయాలని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకరరావు చెప్పారు. మంగళవారం స్థానిక ప్రైవేట్ కన్వెన్షన్ హాల్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2025 గురించి జరిగిన జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో డీపీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో తడి, పొడి వ్యర్థాల నిర్వహణ కోసం అమలు చేస్తున్న కార్యక్రమాల అమలు తీరు పరిశీలన నిమిత్తం కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం వస్తోందని తెలిపారు. స్వచ్ఛతపై వివిధ అంశాలను చూసి మార్కులు కేటాయిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి గ్రామాలకు మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. గ్రామీణ మంచి నీటి సరఫరా జిల్లా ఎస్ఈ అనంతరాజు మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంతోపాటు వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణం, ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించడం వంటి వాటిలో ఉద్యోగులు కృషి చేయాలని కోరారు. డీడీఓలు, డీఎల్‌పీఓలు, ఎంపీడీఓలు, డెప్యూటీ ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంఆర్‌సీలు, పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుంటూరు వైద్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ ఎన్.సుందరాచారి, వైద్యులు

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా నిర్వహిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ గవర్నమెంట్ స్టూడెంట్స్ రీసెర్చ్ స్కీంకు గుంటూరు మెడికల్ కాలేజ్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. తమ పరిశోధనా ప్రాజెక్టుల ఆధారంగా ఈ సంవత్సరానికి వారిని ఎంపిక చేశారు. ఎంబీబీఎస్ విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంపొందించడమే ముఖ్య ఉద్దేశంలో ఈ స్కీం అమలు చేస్తున్నారు. విద్యార్థుల ప్రతిపాదనలను కాలేజ్, విశ్వవిద్యాలయ స్థాయి కమిటీలు పరిశీలించాక ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు మంగళవారం రూ. 10 వేల వంతున చెక్కులను పరిశోధన గ్రాంటుగా అందించారు. ఈ నిధులు ప్రాజెక్ట్ నిర్వహణ, డేటా సేకరణ, ఇతర అవసరాల కోసం వినియోగించనున్నారు. ఈ పథకం ద్వారా అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వంలో విద్యార్థులు పరిశోధన చేసి, తమ ప్రతిభను విశ్వవిద్యాలయ స్థాయిలో చాటనున్నారు. ఇది విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమేకాకుండా భవిష్యత్తులో మంచి వైద్యులుగా ఎదగడానికి సహాయపడుతుందని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుందరాచారి అన్నారు. ఎంపికైన విద్యార్థులను గుంటూరు మెడికల్ కాలేజ్ అధ్యాపకులు అభినందించారు.

గుంటూరు కాపు హాస్టల్‌లో ప్రవేశాలకు ప్రకటన



వివరాలు వెల్లడిస్తున్న సంఘం నాయకులు

గుంటూరు రూరల్: నగర శివారు గోరంట్ల గ్రామం హోసన్నా మందిరం వెనుక ఉన్న కాపు విద్యార్థి వసతి గృహంలో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలగ అభ్యుదయ సంఘం కార్యదర్శి బాలిశెట్టి విజయ్‌కుమార్ మంగళవారం తెలిపారు. వసతి గృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, దూరప్రాంతాలకు చెందిన కాపు విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ నుంచి పీహెచ్‌డీ వరకూ చదువుతున్న విద్యార్థులు, ప్రొఫెషనల్ కోర్సులు చదివేవారు, ఎంబీఏ, ఎంసీఏ, సీఏ, సీపీటీ, సివిల్ సర్వీసులు, గ్రూప్స్, ఎస్ఎస్‌సీ, బ్యాంక్ పీవో వంటి పోటీ పరీక్షలు రాసేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోను నంబర్లు 85208 71568, 86865 55999 లలో సంప్రదించాలన్నారు. సమావేశంలో పూరిబండి శ్రీకాంత్, దేగల వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

రేపు జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-10, 12 బాలబాలికలకు జిల్లా స్థాయి పోటీలు గురువారం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు రూరల్ మండలం పొత్తూరులోని ఏసీఎంఈ స్కూల్ ప్రాంగణంలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

27న నిధి ఆప్‌కే నికత్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన నిధి ఆప్‌కే నికత్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఎస్.తానయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖిగా చర్చలు జరుగుతాయని తెలిపారు. గుంటూరులోని ఏసీ కళాశాల, కృష్ణాజిల్లా బాపులపాడు మండలం బొమ్మలూరులోని దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్, ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఎల్ఆర్ పురంలో సౌత్ సెంట్రల్ జోన్ మెటలి ఫెరస్ మైన్స్ గ్రూప్‌లోని ప్రకాశం వృత్తి శిక్షణ కేంద్రం, విజయవాడలో ఏలూరు రోడ్డు సీతారాంపురంలోని విజన్ ఎడ్యుకేషన్ సొసైటీ, పల్నాడు జిల్లా గణపవరంలోని శ్రీధనలక్ష్మి కాటన్ అండ్ రైస్ మిల్లు, బాపట్ల వ్యవసాయ కళాశాలలో కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.


డయేరియాపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా కాపాడాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'పై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ జూన్ 16 నుంచి జూలై 31వ తేదీ వరకు జరిగే క్యాంపెయిన్‌లో ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జింక్, ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేసి డయేరియాపై అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ కార్నర్లు ఏర్పాటు చేయడం ద్వారా పిల్లల్లో సహజసిద్ధంగా కలిగే నీళ్ల విరోచనాలపై తల్లిదండ్రులకు అవగాహన కలుగుతుందన్నారు. క్యాంపెయిన్ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎ. శ్రావణ్ బాబు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఇ.అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సీఎస్ ఆర్ఎంఓ బాధ్యతల స్వీకరణ



డాక్టర్ వెంకటేశ్వరరావు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంఓగా డాక్టర్ బుజ్జ వెంకటేశ్వరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరుకు చెందిన ఆయన ఆంధ్ర మెడికల్ కాలేజీలో 1982లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. 1992లో పీజీ వైద్యవిద్యను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని నిమ్స్ మెడికల్ కాలేజీలో చదివారు. 1997లో శంషాబాద్ సివిల్ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్‌గా ప్రభుత్వ సర్వీస్‌లోకి వచ్చారు. 2006-10 వరకు గాంధీ ఆసుపత్రిలో పనిచేస్తూ బదిలీపై ఉమ్మడి రాష్ట్ర సచివాలయంలో స్టాటిటిక్ ప్లానింగ్ విభాగంలో పనిచేశారు. 2012లో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పదోన్నతి పొంది రాష్ట్ర వైద్య విద్య సంచాలకుల కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా 2022 వరకు విధులు నిర్వర్తించారు. తర్వాత నుంచి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పని చేస్తూ బదిలీపై గుంటూరుకు వచ్చారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆయనకు ఆసుపత్రి వైద్యులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నకిలీ బంగారంపై రుణం తీసుకున్న ఇద్దరు అరెస్ట్

మంగళగిరి టౌన్: నకిలీ బంగారం తాకట్టు పెట్టి రూ.కోట్లలో రుణాలు తీసుకుని బ్యాంకును మోసం చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు మంగళగిరి పట్టణ సీఐ వీరాస్వామి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళగిరి నగర పరిధిలో ఉన్న కరూర్ వైశ్యా బ్యాంక్‌లో గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తున్న మదన్‌కుమార్ స్థానికంగా ఉండే రాజశేఖర్, మరి కొంతమందితో చేతులు కలిపాడు. 48 మంది పేరిట 147 ఖాతాలు తెరిపించాడు. ఆ ఖాతాల ద్వారా నకిలీ బంగారం తాకట్టు పెట్టించి రూ.9.2 కోట్ల మేరకు రుణాలు తీసుకున్న విషయం విదితమే. ఈ విషయంపై మేనేజర్ వెంకట శివ ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి పోలీసులు గత నెలలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గోల్డ్ అప్రైజర్ చుండూరు మదన్, రాజశేఖర్ అనే వ్యక్తులు మంగళగిరి నగర పరిధిలోని మిద్దె సెంటర్‌లో ఉన్నారని సమాచారం రావడంతో సీఐ వీరాస్వామి, ఎస్ఐ రవీంద్రనాయక్, సిబ్బందితో కలిసి బృందాలుగా ఏర్పడి సోమవారం ఉదయం అరెస్ట్ చేశారు. మంగళగిరి కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఆదేశాలిచ్చారు.